# అంతులేని ఆలోచనలు

"ఎవరికోసం ఈ అలంకార మంతా?" బాగానే ఉంది, శుభ్రమైన చీర కట్టుకొని, తల దువ్వుకోవడం కూడా ఓ పెద్ద అలంకరణేనా!— అయినా ఒకరికోసరమేనా ఏమిటి-మనిషి శుభ్రంగా ఉండటం."

"ఎవరు చూచి సంతోషించాలనీ?"

మరొక రెవరూ చూడనూ అక్కర్లేదు—సంతోషించనూ అక్కర్లేదు. నామట్టుకు నాకు ఆనందం కలిగితే చాలు. పూర్వం సంతోషించవలసిన మనిషి ఉన్నప్పుడే వారింట్లో మంచిచీర గట్టుకొనే భాగ్యమైనా కలిగిందీ?" అని తనలో తాను తర్కించుకొంటూ నిట్టూర్పులు విడుస్తోంది సరళ. తెల్లని నల్లంచు ఇస్త్రీ చీర కట్టుకొని, నీలంరంగు జాకెట్టు వేసికొని తల దువ్వుకొంటూ నిలువుటద్దంముందు నిల్చున్నది. అద్దంలో ఫొటో ఒకటి కన్పించింది. ఒక్క నిముషం చకితురాలయి దాన్నే ఆసక్తితో చూచింది.

అరె! అప్పటికీ ఇప్పటికీ ఎంత మార్పు? 'అవును ఆ ఫొటో నేను కాపరానికి వచ్చేముందు తీయించుకున్నాను. ఆ బుగ్గలూ ఆకళ్ళూ- అవును అప్పుడోనాడు బావ అన్నట్లుగా-నా అందమంతా బుగ్గల్లో, కళ్ళల్లో దాగిఉండేది-అట్టే పొడగరిని కాకపోయినా అప్పటికి కొంచెం ఒళ్ళు చేయడంచేత ఎంతో నిండుగా ఎత్తుగాఉన్నాను-ఏమిటో అప్పటి రూపేవేరు. అప్పుడు చూచినవాళ్ళు ఇప్పుడు చూస్తేనన్నసలుపోల్చుకోలేరేమో! ఎంతలో ఎంతమార్పు వచ్చిందీ......అబ్బబ్బ......ఎందుకీ ఆలోచనలు-అంత అందం ఉండీ అప్పుడేమన్నా ఫలితం దక్కిందా-

ఇప్పుడు లేకపోయిందని ఇదవడానికి !" అని మళ్ళీ విసుక్కున్నది సరళ. జడ భుజాలమీదుగా ముందుకు వేసుకొని రిబ్బను విప్పుతూ. "మొదట్లో ఎంత పెద్దజడ! తాచు పాములా క్రిందకు వేలాడుతూఉంటేఎంతోగర్వపడేదాన్ని, అసలు కాస్త పైపై నదువ్వుకొని జడ వేసుకోవడమే ఎంతో కష్టమనిపించేది...ఆమొదటి కాన్పుతర్వాతనే సగానికి సగం జుట్టురాలి పోయింది...... అదొక్కటే నిదర్శనం ఆకాన్పుకు — లోపల్లోపల ఎంతబాధ పడ్డాను ! అప్పుడా యన బెంగుళూరులో కాబోలు ఉన్నారు. అప్పటికి రాలేకపోతున్నానని ఒక్క ఉత్తరం ముక్కయినా రాయలేకపొయ్యారు—పెద్దమనిషి! ఊళ్ళో అందరికీ పెద్దమనిషే- ఊళ్ళో ఏమిటి ఇంట్లోనూ దాదాపు అంతే— ఎటొచ్చీనా ఒక్కొత్తె విషయంలోనే కాదు...పోనీ ఆ అత్తగారైనా నాయందు కాస్త దయగా ఉందా! కోడలు వచ్చిన వేళా విశేషం అంటూ మాటిమాటికీ దెప్పిపొడుపులు—అదేం పాపమో! అదేం మనుష్యులో!తను కొడుకును అదుపులో పెట్టుకోలేక నామీద పడి ఏడ్చేది, వాళ్ళను అని ఏం లాభం! అసలుతప్పంతా ఆయనదే. సామెత చెప్పినట్టుగా—చేసుకున్న మొగుడు...నిజమే.

మనిషి రూపసే కావచ్చు-పచ్చని బంగారు ఛాయలో చాలా ఆకర్షణీయంగానే ఉండవచ్చు—గడిమాయని గ్లాస్కో పంచెలూ, ఖరీదైన సిల్కు లాల్చీలూ వేసుకొని. బెల్టు చెప్పులు తొడుక్కొని. తెరపి లేకుండా సిగరెట్లు కాలుస్తూ-ఉద్యోగం. సద్యోగం లేకుండా స్నేహితుల్ని వెంటేసుకొని ఊళ్ళో రోడ్లవెంటా, ఊళ్ళవెంటా తిరిగే తాహతుకల మనిషే కావచ్చు-కాని, అబ్బ అంత అహంకారమా! అంత కోపమా! అంత విసుగా!...ఎందుకో అర్థంకాదు. తన వ్యవహారాలకు నేనేమన్నా అడ్డం వచ్చానా ఏమన్నానా!—మొదట్లో ఆయనగారుచెప్పినదల్లా నమ్మాను

గదా! ఏదో పెద్ద వ్యాపారం చేస్తున్నాను-సరుకు వచ్చి కూర్చుంది—డబ్బు కట్టాలి అంటే అమాయకంగానమ్మి వంటిమీద ఉన్న బంగారం... రెండో కంటికి తెలియకుండా పన్నెండు నవర్సుల బంగారమూ-తీసి ఇచ్చానే! తాను స్వేచ్ఛగా ఎక్కడెక్కడో తిరిగి తిరిగి వారానికోసారి ఇంటికివస్తే-ఎప్పుడు వచ్చినా నేనేమైనా విసుక్కున్నానూ! ఏ ప్రతిఫలం ఆశించకుండానే సేవచేశానే!...అయినా నా పిచ్చగానీ అటువంటిమనిషిని మార్చడం నా తరమా-నన్ను పుట్టించిన బ్రహ్మతరమా! ఆయనకూ తన కయినవాళ్ళంతా చెప్పిచూశారుగా, విన్నారూ! వాళ్ళకెవరికీ సాధ్యం కాని పని నేను సాధించాలని చూడటం నా వెర్రితనమేనని ఋజువు అయింది. అందుకే నా ప్రయత్నాలన్నీ వ్యర్థమయ్యాయి. ఏదైనా తనకు కాస్త ప్రతిబంధకంగా కనిపిస్తేచాలు-ఊరికే అకారణంగా కోపం తెచ్చుకొని దేంతో పడితే దాంతోనే నాలుగు బాది వెళ్ళిపోయేవారు. అబ్బబ్బ ఎందుకు పాత సంగతులన్నీ. మనస్సు పాడుచేసుకోవడం-. అనుకొన్నది సరళ కళ్ళుపమిటకొంగుతో ఒత్తుకొంటూ. ఆమె ఇంతకు ముందు ఎన్నిసార్లో పాత విషయాలుజ్ఞాపకం చేసుకొని బాధపడకూడదని నిశ్చయానికి వచ్చింది. కాని అలా ఉండలేక పోయింది. జడ వేసుకోవడం మానేసి జుట్టు ముడి వేసుకొని తన చిన్ననాటి ఫొటోముందు పరధ్యానంగా మళ్ళీ చూడసాగింది సరళ.

'ఆయన్ని నేనాకర్షించలేక పోవడానికి కారణమేమిటో! నేను పెద్ద అందెకత్తెను కాకపోయినా, అందవికారిని మాత్రం కాదే! కేవలం పల్లెటూరిదాన్నీ కాదే! ఆయన ముందు ఎన్నడూ పెంకెగా ప్రవర్తించలేదే! అసలేమిటో తెలియని ఆ తొలిరోజు మట్టుకూ కొంత పెంకెతనం పోయిన మాట నిజమే. అవును నిజానికప్పుడు నాకాగొడవే తెలియదు-ఆయన్ని చూడంగానే నిలువునా వణకిపోయాను. నన్ను బుజ్జగించి, లాలించి లొంగ తీసుకోడానికి బదులుగా ఎంత దౌర్జన్యం

చేశారూ_అబ్బ! అంత హడలు కొట్టాలా ఏమిటి? _ పోనీ ఆనాడు అల్లా జరిగిపోయింది_కాని తర్వాత నేనెంత వినయంగా మెలుగుతూ వచ్చాను! కాని తర్వాత తర్వాత నా ముఖం చూడటానికే అంత అసహ్యా పడేవారే! నేనంత అందవికారినా! కాదు_ఆయన దృష్టిలో మాత్రంకాదు_కాదుగనుకనే ఆయనకుఅంత అనుమానం.కాసేపు వాకిట్లో నిల్చోకూడదు. నిర్బంధం_అంతులేని నిర్బంధం. అర్థంలేని అనుమానం. తనమాదిరిగానే_అంతా అలానే ఉంటారని కాబోలు! తనకేం మహా రాజులా మగవాడు. అడ్డుపెట్టేవారెవరూ? అయినా ఆటంకం ఉన్నదా లేదా_అన్నది ప్రశ్నేకాదు_అదో స్వభావం. ఆ స్వభావమే ఉంటే కన్ను గప్పడ మెంత సేపూ. పోనీ నా స్వభావం బాగా తెలిసిన తర్వాతనైనా నామీద సానుభూతి కలిగిందా అని" అనుకొన్నది సరళ విసుక్కుంటూ.

"మంచో చెడో పోనీ అల్లాగే నాలుగు కాలాలపాటు ఆయన బ్రతికిఉన్నా నా బ్రతుకు అదోలా గడిచేది. ఒకప్పుడు కాకపోతే మరో అప్పుడయినా మనసు మారిఉండేదేమో....అవును, ఆ మాటకువస్తే ఆయన మనసు మారిందనే చెప్పాలి ఆజబ్బు! పడ్డప్పుడు .... కాని ఎల్లా వచ్చిందో ఆ పాడు జబ్బు...అకస్మాత్తుగా వచ్చింది...ఆ జబ్బు విషయమై అసలు సంగతి బయటపడేసరికి తనవాళ్ళే దగ్గర కైనా రాలేదు. కాని_ఎందుకో నా కాయనమీద నిజంగా జాలికలిగింది. మనిషి అల్లా పుల్లలా అయిపోయారు. పాపం! ఎల్లాంటి మనిషి ఎల్లా అయిపోయారూ! ఆ సమయంలో నేను దగ్గరఉండి అహోరాత్రాలు సేవ చేస్తూంటే మనిషి ఎంతో ఆశ్చర్యపోయారు. "సరళా నేను నిజంగా నీకూ...అసలు నాకీ సేవ ఎల్లా చేస్తున్నావూ? నామీద నీకు అసహ్యం, కోపం కలుగలేదా? అని మళ్ళీ హీనస్వరంతో అడిగారు."...పాపం తన జీవితాధ్యాయం అంతం కాబోతుందని తెలుసును కాబోలు_కళ్ళవెంట నీరు పెట్టుకొని "చూడు సరళా! నువ్వింకపుట్టింటికి వెళ్ళిపో_ఈజబ్బు

మంచిదికాదు...నిన్ను బ్రతికిఉండగా సుఖపెట్టలేక పోయాను-నీకు అన్యాయంచేసి వెళ్ళిపోతున్నాను" అంటూ విచారపడ్డారు. "లేదండీ-మీ జబ్బు నయమవుతుంది. కాస్త ధైర్యంగా ఉండండి." అని నేనెంత ఓదార్చానో! ఆ జబ్బు నయమై గండం గడవాలని ఎంతమంది దేవుళ్ళకు మ్రొక్కుకొన్నానో-ఏ దేవునికీ నామీద దయ కలుగక పోయింది.... పాపం! ముప్పయి యేళ్ళయినా నిండకముందేవెళ్ళిపోయారు...ఇంతకూ నేను నిర్భాగ్యురాల్ని...చివరలో కలిగిన పశ్చాత్తాపంతో మా జీవితాలు ముందు ముందు సౌఖ్యమయం కాబోతున్నాయని కలలు కన్నాను— గంపెడాశతో అందరూ వద్దంటున్నా అక్కడే ఉండి సేవచేశాను-కాని ఫలితం! జీవితం అంతా దుఃఖమయంచేసి వెళ్ళిపోయారు." అని అను కొంటూ తనకు తెలియకుండానే చెక్కిళ్ళపై ధారలు కడుతున్న కన్నీటిని పమిటికొంగుతో తుడుచుకొన్నది సరళ..

"ఏమిటో-ఏం లాభం-అంతే-ఎవరు ఎంతకాలం ఉండాలో ఉండి వాళ్ళ దార్ని వాళ్ళు వెళ్ళిపోతారు. పోనీ నాకూ రాకూడదూ..." అబ్బబ్బ! ఏమిటా ఆలోచనలు-వెర్రి-ఒట్టి వెర్రి-వద్దని ఎన్నిసార్లు చెప్పేనూ?-అనిప్రశ్నించుకొన్నది తనకుతానేచీదరించుకొంటూ.నెమ్మదిగా వెళ్ళి ఆ గదిలో కిటికీకి ప్రక్కగా బల్లకు ఎడమ వైపుగా ఉన్న పడక కుర్చీలో కూర్చొని ఏదో నవల చదువుకొందామని కొంతసేపు ప్రయత్నం చేసింది. కానీ పేజీలు తిరగవేయడమేగాని ఆ ప్రయత్నం ఏమాత్రమూ కొనసాగలేదు. పుస్తకం మూసేసి బల్లమీద పడేసి కాసేపు కళ్ళు మూసుకొన్నది. మరో నిమిషం గడిచింది అల్లాగే. అంతలో ఆమె దృష్టి ఎదురుగా ఉన్న గోడ గడియారంమీద పడింది. ఆరు కొట్టడానికి మరో నిముషం ఉన్నది. "సరిగా నాన్నగారు వచ్చేవేళ అయింది. ఆయన వచ్చీ రావడంతో "అమ్మాయి! కాఫీ ఇవ్వమ్మా— అంటారు-నేనే ఇవ్వాలి. ఆయన పనులన్నీ నేనే చూడాలి. నేను

ఏమాత్రం విచారంగా కనుపించినా సహించలేరు. అబ్బ! ఈయనది ఎంత మెత్తని హృదయం-ఎంత దయా-ఎంత ప్రేమా! నిదానం, మంచి తనమూ కలిపి రూపు కట్టిస్తే ఈయన అయ్యారా అన్నట్లుగా ఉంటారే!

మరీ దౌష్ట్యాన్ని తట్టుకోవడము ఎంత కష్టమో మరీ ఇంత మంచితనాన్నీ, ప్రేమనూ భరించడం కూడా అంతే కష్టమనిపిస్తుంది.

"ఎందుకమ్మా! అల్లా ఉన్నావూ" అంటూ మాటిమాటికీ అడుగుతూ ఊరికేనే ఇదవుతారు. "వద్దమ్మా వద్దు-పాత సంగతులన్నీ పూర్తిగా మర్చిపో - చక్కగా నవ్వుతూ సంతోషంగా ఉండు. ఇప్పుడు నీకేం తక్కువ చెప్పు-కాస్త మనస్సు మరల్చుకోం బేసరి. చూడూ ఆ శ్రీరామ చంద్రుణ్ణి తలుచుకో, అన్ని బాధలూ పోతాయి." అంటారు. పైకి అల్లా అంటారేగాని లోపల తాను ప్రతి క్షణమూ నా విషయమై విచారపడు తూనే ఉంటారు. కాని పాపం ఆయనేం చేస్తారు? లక్షణమైన సంబంధం అని ఏరీ కోరీ చేస్తే అది ఇల్లా అయింది. తానొకటి తలిస్తే దైవమొకటి తలచాడు...కాని ఏదైనా ఆయనకు ఈ ముసలితనంలో నావల్ల లేనిపోని బాధ కలిగించకూడదు" అని నిశ్చయానికి వచ్చింది సరళ. అంతలో గోడగడియారం గంటలు కొట్టింది. 'ఎందుకబ్బా ఈయన ఈవేళ ఇంకా రాలేదూ!, అంటూ కిటికీలో నుంచి మెట్లవైపుకు బయటకు చూచింది వస్తున్నారేమోనని. మరోనిముషందాకా అల్లాగే చూస్తూ ఉండిపోయింది, అప్పటికే సంజెచీకటులు నాలుగు వైపులా వ్యాపిస్తున్నాయి. పైనుంచి సన్నగాపడుతున్న మంచూ, ఇళ్ళపై పెంకుల్లోనుంచీ-దొడ్లల్లోనుంచీ విస్తారంగా, ఉంగరాలు ఉంగరాలుగా, సుళ్ళు తిరుగుతూ వస్తున్నపొగా కలిసి వాతావరణమంతా కమ్మేసుకొంటున్నది, హో రుమని శబ్దం చేస్తూ ఈదురుగాలి ఒక్కమాటు తలుపుతోసుకొని గదిలోకి ప్రవేశించి మూలుగుతూ నాలుగు మూలలా తిరిగి కిటికీలోంచి మాయమయింది. తలుపు చప్పుడయ్యేసరికి ఒక్కమాటు ఉలిక్కిపడి, అటుచూస్తూ 'అరే! అప్పుడే

ప్రొద్దుపోయిందే-హిందీ మాష్టారు కూడా వచ్చేవేళయింది. అదొక గొడవ-హిందీని గురించి పెద్ద ఉపన్యాసాలు చెప్పుకుపోతారు-అదో శోది-ఛా. అలా అనకూడదు-పాపం! చాలా మంచివారు ఆయన— అసలు వీళ్ళంతా కలిసి నాకు మనశ్శాంతి కలుగచేయాలని చూస్తు న్నారు. ఇదంతా అన్నయ్య పథకం-ఎందుకో వాడికి నామీద ఇంత ఆప్యాయత. ఏమిటో చెబుతాడు. నిజానికి నాకు దేనికీ రాజకీయాలూ? ఆంధ్రదేశ రాజకీయాల దగ్గర నుంచి ప్రపంచ రాజకీయాలదాకా చెప్పుకు పోతాడు. పిచ్చి అన్నయ్య-ఏమిటో చెబుతాడు. చెబుతున్నంత సేపూ కొంత కుతూహలంగానే ఉంటుంది-కాని దానివల్ల నా కేం లాభం? మరీ అన్నయ్యా. వాడి మిత్రుడు మోహన్‌రావూ కలిసి కూర్చుని వాదించుకొంటూ ఉంటే చూడాలి తమాషా! భలే! నిజంగా వాళ్ళ సొంత ఇంటి విషయాల్లాగా-కొంపలు మునిగిపోతున్నట్లుగానే వాదించుకొంటారు. అబ్బ! ఆ మోహన్‌రావు గంభీరంగా మాట్లాడుతూ ఉంటే చూడాలి. నిజంగా నాకు నవ్వు వస్తుంది." అను కొన్నది సరళ.

ఎఱ్ఱని అందమైన పెదవులపై మధుర మందహాసం. అంచక్కా- తెల్లగా మెరుస్తూ వరుసైన పలువరస, వంకులు వంకుల జుత్తు- మోహన్ ఆమె కళ్ళముందు ఒకసారి కన్పించినట్లయ్యింది.

అవును అతని కన్నుల్లో ఏదో గొప్పతనం ఉన్నది. అవి ఎంతో గంభీరంగా - స్ఫూర్తిమంతంగా - సానుభూతి స్ఫోరకంగా కన్పిస్తాయి. అవును-చాలా అందంగా కన్పిస్తాయి. అసలు-కొందరి అంద

మంతా కన్నుల్లోనే ఉంటుంది. ఆ అవును మరి కొందరి దుష్టత్వంఅంతా వాటిలోనే ప్రతిఫలిస్తుంటుంది. రెండూ నిజమే! ....ఆయన కళ్ళూ, ఆ చూపులూ అబ్బ! ఎలా ఉండేవి!! ఎప్పుడూ ఎర్రగా ఉండేవి. కాస్త కోపం వచ్చిందా చింతనిప్పుల్లా అయిపోయేవి! దౌర్జన్యం_దురహంకారం వాటిల్లోనే తాండవిస్తుండేది! కానీ...ఏమిటో...సృష్టిలో ఉండే వస్తువు ఒక్కటే అయినా ఎంత వైవిధ్యం ఉందీ!

"మోహన్‌రావూ ఒక్కొక్క సమయంలో చాలా గమ్మత్తుగా కన్పిస్తాడు" అని అనుకొన్నది సరళ. అంతలో ఆమె ముఖం వివర్ణమయింది. "అవును మోహన్‌రావూ భలేవాడే! అతన్ని నేను కనుక క్షమించాను. మరొకళ్ళయితేనా! ఎంత అల్లరి పెట్టేవాళ్ళో!...అబ్బ... చివరి కెంత మోసం చేశాడూ!...అయితే అతను నిజంగానే మోసం చేశాడా? అందులో నాతప్పేమీ లేనేలేదా?" "ఉన్నది.అతను రమ్మంటే మట్టుకూ అతనితో రెండోఆటకు సినిమాకు ఎందుకు వెళ్ళాలీ! పోనీ వెళ్ళినా ఆట బాగుండలేదని తిరిగి అతని కార్లోనే వచ్చేస్తూ దారిలో వాళ్ళింట్లో టీ పుచ్చుకోవడానికి ఎందుకు ఆగాలీ! సరాసరి ఇంటికి వచ్చేయకూడదూ? అవును. నిజమే. అల్లావెళ్ళడమే తప్పయిపోయింది తప్పా తప్పున్నర తప్పా...అవును నాదే తప్పు..." అని మళ్ళీ మళ్ళీ అనుకున్నది. సరళ కా విషయమంతా మళ్ళా ఓసారి జ్ఞాపకం రావడం మొదలుపెట్టింది.

అప్పటికి దాదాపు పదకొండు అయింది. ముందుగదిలో సరళా మోహన్ ఇద్దరే కూర్చుని ఏదో మాటాడుకొంటున్నారు. ఇద్దరిలోనూ మోహన్ ఏదో, ఎక్కువగా మాటాడుతున్నాడు. సంఘజీవితం

గూర్చి. సంఘ సంస్కరణోపాయాలను గూర్చి దీర్ఘంగా చెప్పుకు పోతున్నాడు. ఆస్తి అంతా తన చేతిలోకి రాగానే దాన్ని పూర్తిగా మానవసేవకై ఉపయోగిస్తాననీ, తన జీవితమే ఆందుకు అంకితం చేస్తాననీ చెబుతున్నాడు. అతడాపనులన్నీ నిశ్చయంగా చేయగలడనీ-చేసి తీరుతాడనీ సరళకు దృఢవిశ్వాసం ఉన్నది. అంతలో ఒక్కసారి జోరున వర్షం కురవడం మొదలుపెట్టింది, అది పెద్దదై కుంభవర్షం అయింది-కుండలతో ఎత్తి క్రుమ్మరించినట్లు నిలిచి కురుస్తోంది. నీల మేఘాలు ఆకాశం అంతా ఆవరించుకొన్నాయి.

"ఏమిటో ఈ ఊళ్ళో అనుకోకుండా వర్షం కురుస్తుంది. ఉన్నట్టే ఉండి ఎక్కడ్నించి వస్తాయో ఏమో మేఘాలు వచ్చేసి-ఆకాశం అంతా కమ్మేసి నీళ్ళు దిమ్మరించేస్తాయి" అన్నది సరళ.

"నిజమే ఈ యేడాది దేశం అంతటా వర్షాలు ఎక్కువ గానే ఉన్నాయి. నెలరోజుల్నించి ఒక్కటే వర్షాలు. ఈ అకాలవర్షాల వల్ల-పంటలు ఏమయిపోతాయో-ఏమో! అసలే జనం తిండికి ఇబ్బంది పడుతున్నారు. ఈ వర్షాలవల్ల పంట దెబ్బతిన్నదా-ఇంకేముంది జనం అల్లాడిపోతారు. పాపం! పేదవాళ్ళకే ఏమొచ్చినా వస్తాయి ఇబ్బందులు" అన్నాడు మోహన్.

అంతలో ముందు ఆ వీధివీథంతా, తర్వాత మరోక్షణానికిఊళ్ళో అంతటా విద్యుద్దీపాలు పోయాయి, నిబిడ గాఢాంధకారము అంతటా అలముకొని పోయింది. సముద్రపు హోరు మరీఎక్కువగావినిపిస్తోంది. ఎక్కడో దూరంగా ఎవరి పంచలోనే ఉన్న కుక్క మధ్య మధ్యబొయ్యి మని అరుస్తోంది. ఇంటికి ముందు నలభై గజాల దూరంలో ఉన్న రోడ్డుమీద అలికిడే లేదు. మోహన్ ఎందుకో మాటాడటం మానేశాడు.

"అరే! అదేమిటి లైట్లు పోయాయి! ఊరంతటా ఒక్కసారి పోయాయేమిటి? చూశావా ఎంత విచిత్రమైన మార్పో! ఒక్క నిముషంలో కటికచీకటి మయమైపోయింది"! అన్నాడు మోహన్ వెనక్కు సోఫాలో జారగిలపడుతూ.

భయపెడుతూ. హోరుమని ఈదురుగాలి వీస్తోంది. జల్లు కిటికిల్లోంచి గదిలోకి కూడా కొట్టింది. సరళ తను కూర్చున్న కుర్చీకి దగ్గరగా ఉన్న కిటికీ రెక్కలు మూసి మళ్ళీ వచ్చి కూర్చున్నది. మోహన్ కదలకుండా కూర్చొని మధ్య మధ్య 'పాడువాన' 'పాడువాన' అంటున్నాడు. సరళ ఆ నిశ్శబ్ద వాతావరణాన్నీ-ఆ నిబిడ నిశీధాన్నీ భరించలేక పోయింది. ఆమె హృదయంలో ఏదో భయం కలిగింది. "ఛా ఛా, చిన్నపిల్లలా నేను భయపడుతూన్నానేమిటి?" అనుకొన్నది సరళ.

భూనభోంతరాళం దద్దరిల్లచేస్తూ మేఘం ఉరిమింది. అప్రయత్నంగా "మోహన్! నాకు భయమేస్తోంది" అన్నది సరళ.

"భయమా! అదేమిటి ఉరుముల్నీ, మెరపుల్నీ చూసి పెద్దవాళ్ళు భయపడతారా ఎక్కడైనా? భలే పైగామీరు నాకంటేపెద్దకూడానూ!" అన్నాడు మోహన్. సరళ నెమ్మదిగా లేచివెళ్ళి మోహన్‌సోఫాకుఎదురుగా ఉన్న కిటికీ దగ్గిర గాఢనిశీధంలోకి చూస్తూ నిలబడింది. మెరుపు మెరసినప్పుడల్లా గది అంతా ఒక్కమారు వెలిగి కాంతిమయమై మళ్ళీ అంతలో చీకటిమయమవుతోంది. "మోహన్! నాకు నిజంగానే భయమేస్తోంది" అన్నది సరళ మళ్ళీ. "ఏం ఫరవాలేదు" అన్నాడు మోహన్. "అదికాదు - నౌకర్ను పిలిచి లాంతరొకటి వెలిగించి తీసుకొని రమ్మను" అన్నది సరళ. "నువ్వు చెప్పడము బాగానే ఉంది. కాని వాడు ఎక్కడో దొడ్లో పాకలో ఉన్నాడు. ఈ వానలో వాడిదగ్గరకు వెళ్ళడ మెల్లా-వాడ్ని నిద్రలేపడ మెల్లా! ఈ లోపల లైట్లే

వస్తాయి" అని "అయినా కేక వేస్తానుండు" అని అతను లేచి కొంచెం తడుముకొంటూవెళ్ళి గుమ్మం దగ్గర నిలబడి పెద్దగా కేక వేశాడు. కాని ఆ హోరుగాలిలో అతని కేక గదిలో ఉన్న సరళకే సరిగ్గా వినబడలేదు. ఒక్క నిముషం అక్కడే నిలబడి మళ్ళీ తన స్థానానికి చేరుకుందామని మెల్లగా వస్తున్నాడు మోహన్. అతనలా వస్తూ ఉండగా బ్రహ్మ ప్రళయంగా ఉరిమింది. పెద్ద శబ్దం చేస్తూ నిప్పులు చెరుగుతూ పిడుగు సరిగ్గా వాళ్ళ దొడ్డి ఆవరణలోనే పడ్డది. అది చూచీ చూడడంతోటే సరళ "అమ్మో!" అని పెద్దగా కేకవేసి తన కో గజం దూరంలో ఉన్న మోహన్ చెయ్యి పట్టుకొన్నది. "అదేమిటి అల్లా వణకిపోతున్నావు!" అన్నాడు మోహన్ ఆమె చేతిని దగ్గరగా తీసుకుంటూ.

సరళ "ఏమో!" అన్నది. మోహన్ భయం లేదంటూ ఆమె వీపుమీద అరచేత్తో చరిచాడు. అంతే! అతనిలో ఏదో మార్పు వచ్చింది. ఆవేశం వరదలా పట్టరాకుండా పోయింది. ఆమెను ఒక్కసారి రెండు చేతులతోనూ అందుకొని గభాలున తన వక్షస్థలానికి గట్టిగా హత్తుకున్నాడు. సరళ మొదట నిశ్చేష్టురాలైంది. నోటమాట రాలేదు. మనిషి నిలువునా కంపించిపోయింది. ఏం చేయాలో వెంటనే తోచలేదు. రెండు క్షణాలు గడవకముందే అతన్నుండి విడిపించుకోవాలని ప్రయత్నె చేసింది. అతని గాఢాలింగనము నుండి విడిపించుకోవడము ఆ క్షణంలో తన తరము కాదేమో ననిపించింది. అతని శరీరమంతా ఆవిరి గ్రక్కింది. సరళ నిస్సహాయ స్థితిలో మరోక్షణం అలాగే అతని కౌగిలిలో ఉండిపోక తప్పిందికాదు. కౌగిలిబిగిస్తూ అతను ఆమె పెదిమల్ని ముద్దాడటానికి ప్రయత్నం చేశాడు. కాని వీలులేకపోయింది.

మరో నిముషానికి లైట్లు వచ్చాయి. అప్పటి కాతని ఆవేశ

ౌద్ధత్యం తగ్గింది. సరళ విడిపించుకొడానికి మళ్ళీ ఒసారి గట్టి ప్రయత్నం చేసింది–"వద్దు వద్దు" అంటూ అతన్ని అవతలకు నెట్టేసి తను దూరంగా వెళ్ళి గుమ్మందగ్గర నిల్చొన్నది. జరిగిన సంగతంతా సరళకు ఒక్కసారి స్ఫురణకు వచ్చింది. ఒక్కమాటు అతన్నిఏమేమో అందా మనిపించింది. అతను మాటాడకుండా సోఫాలో కూర్చొని మరో వైపు చూస్తున్నాడు. "ఛీ! ఏంపని చేశావు మోహన్!...ఇల్లా చేస్తావని నేనెప్పుడూ అనుకోలేదు" అన్నది సరళ. మోహన్ మారుమాట పల్క లేదు. చేతులు మొహంమీద కప్పుకొని మౌనంగా కూర్చు న్నాడు. సరళ కోపంగా చరచరా వెళ్ళి చేతులుతీస్తూ ఏంమాట్లాడవేం?" అన్నది. కాని మరుక్షణంలో అతనివంక చూస్తూ "అదేమిటి మోహన్! నువ్వు-ఏడుస్తున్నావా?" అన్నది సరళ కొంచెం పెద్దగా. మోహన్ మాటాడలేదు. "ఎందుకూ ఏడుస్తున్నావు?" అని దగ్గర నిలబడి మళ్ళీ మళ్ళీ ప్రశ్నించింది సరళ. "ఇప్పుడు నువ్వు అన్న ట్లుగా – తప్పుచేసినందుకు" అన్నాడు మోహన్, ఒక్కొక్క మాటే మెల్లగా అంటూ. ఇద్దరూ మాటాడ కుండా అల్లా ఉండిపోయారు మరో పది నిముషాలదాకా. బయట రోడ్డుమీదకూడా అంతా నిశ్శబ్దంగా ఉన్నది. వర్షం చాలావరకు తగ్గింది. కొంచెం జల్లు ఇంకా పడు తూనే ఉన్నది. రోడ్లమీద నీటి ప్రవాహాలు వేగంగా పల్లపు ప్రాంతాల్లోకి విశ్రాంతి తీసుకొందామని పరుగెత్తుకు పోతున్నాయి. మోహన్ మరోవైపు తిరిగి అరచేతిలో గడ్డం పెట్టుకొని మోచేతిని కాళ్ళమీద ఆనించి కూర్చున్నాడు.

"మోహన్!...మాటాడవేం? టైమెంత అయింది?"

"పన్నెండూ" అన్నాడు మోహన్.

"సరే నేనింక వెళ్ళిపోతాను" అంటూ చరచరా గుమ్మందాకా

వెళ్ళి. నిరామయంగా ఉన్న రోడ్డుమీద కోసారి చూచి—అక్కడే ఆగి పోయింది. "చూడు, సరళా! తప్పంతా నా నెత్తినే రుద్ది—నా హృదయాన్ని గాయపరచి కోపంగా వెళ్ళిపోకు—అయినా నాతప్పు క్షమించు— నన్ను క్షమిస్తావనుకోను—పోనీ ఇక్కడే శిక్ష విధించి వెళ్ళు...క్షమించమని మళ్ళా ప్రార్థిస్తున్నా" అని ఇంకా ఏమో చెప్ప బోయి ఆగిపోయాడు మోహన్.

"అవన్నీ తర్వాత చూచుకొందాము — ముందు నేను వెళ్ళి పోవాలి."

"అహ అల్లా కాదు—ముందు నన్ను క్షమించానని చెప్పు."

"లేకపోతే—నాకేం ఇప్పుడు భయంగా లేదు-స్వయంగా వెళ్ళి పోగలను."

"అబ్బే! అదికాదు—అయినా ఎందుకు—నీకు ఇంకా కోపం తెప్పిస్తున్నానేమో! క్షమించు" అంటూ చరచరా మోహన్ గదిలోంచి వెళ్ళిపోయి మరో నిముషంలోవచ్చి "కారు తీసుకొనివచ్చాను—పద, ఇంటి దగ్గర దిగపెట్టి వస్తాను" అన్నాడు.

సరళ మారుమాట చెప్పకుండా వెనుక సీటులో ఎక్కి కూర్చుని ఒక సుదీర్ఘమైననిట్టూర్పు విడిచి, వెనక్కు జారగిలిపడుతూ "అమ్మయ్య!" అని అప్రయత్నంగా అనుకొని తాపీగా కూర్చున్నది. ఇంటికి వెళ్ళేదాకా ఆమె చెవుల్లో అతను చివరకు అన్నమాటలు గింగురుమంటూనే ఉన్నాయి. "ఎందుకబ్బా—ఈ విషయమంతా ఇప్పుడు జ్ఞాపకం వచ్చిందీ?" అంటూ సరళ తన్ను తానే ప్రశ్నించుకొన్నది.

"అవును అల్లా జరిగింది ఆవిషయమంతా.అందులో తప్పెవరిదీ—పూర్తిగా నాదేనా?ఆనిజమే, ఆ వయస్సులో ఉన్న యువకుణ్ణి ఉద్రేకపరి చాను.అటువంటి అవకాశం నేనేకల్పించాను. 'నాకుభయమేస్తోంది' అని అప్పుడు అనకుండా ఉండవలసింది...ఏమిటో అనుకొంటూ మిప్పుడు—

ఆ స్థితిలో నేనెందుకన్నానో—ఎందుకా పరిస్థితిలోకి వచ్చానో నాకే అర్థం కాదు" అనుకొన్నది సరళ. ఆ విషయమంతా ఇప్పు డొక్కసారి జ్ఞాపకం వచ్చేసరికి మనస్సులో ఏదో మార్పు వచ్చింది. అది భయమా—అవమానమా—తన కిష్టంలేని పని జరిగినందుకు కోపమా—. ఏదో చెప్పలేని బాధ మబ్బులా శరీరమంతా ఆవరించింది.

"ఏమిటిది ఇంతకోపం వచ్చింది. ఎందుకీకోపం—నియమ భంగం జరిగినందుకా? ఎవరి కోసం ఈ నియమాలన్నీ—అయినవాడు లేక పోయినప్పుడు?...అయితే నియమాలే అక్కర్లేదా?" అని మళ్ళా తన్ను తానే ప్రశ్నించుకొన్నది సరళ పమిటకొంగుతో మొహం తుడుచు కొంటూ.

అవును మోహన్‌తో పరిచయం చివరికి అల్లా పరిణమించింది అల్లా అవుతుందని ఎన్నడూ అనుకోలేదు; అతనూ అనుకొని ఉండడు. అతను అటువంటివాడు కాడు — అతను ఎన్నడూ నన్ను కవ్వించ లేదు—అటువంటి కొంటె ప్రయత్నాలేమీ చెయ్యలేదు-అసలు మొదట్లో నా పరిచయాన్ని అతను లెక్క పెట్టేవాడే కాదు.

నిజమే—అన్నయ్య నా కతని పరిచయం కలిగించినప్పటినుంచీ నేనే కావాలని ఆ పరిచయం పెంచుకొన్నాను. అతని మీద ఎంత గౌరవం, ఎంత అభిమానం ఏర్పడ్డాయి! ఎందుకో కొందరిమీద ఇట్టే గౌరవ మేర్పడుతుంది! అతని సాంగత్యం లభించిన ఏడాదిలోనూ నాలో ఎంత మార్పు వచ్చిందీ! ఎన్ని విషయాలు నేర్చుకొన్నానూ!ఎన్ని విష యాలు నేర్చుకోవలసినవి ఉన్నాయని తెలుసుకొన్నానూ! అతను విజ్ఞాన సంబంధమైన విషయాలు మాటాడు తుంటే—అతని దృష్టి మరి దేని మీదకూ పోదు. కాస్త పరధ్యానంగాకన్పిస్తే ఎంతో కోపగించుకొనేవాడు. అవును ఏ విషయం చెప్పినా—ఓ పెద్ద మేధావిలా చెప్పుకుపోయే వాడు. ఎంత గొప్పగా మాటాడతాడూ! అప్పట్లో అతని ఔన్నత్యంతో

పోల్చకోడానికి ఉపమానంకోసం-ఆలోచించి-ఆలోచించి హిమాలయాలు ఒక్కటే సరిగా సరిపోతాయనుకొన్నాను...ఏమిటో అతన్ని గురించి ఏం జ్ఞాపకం వచ్చినా ఇప్పటికీ అతనిమీద అభిమానమే కలుగుతోంది. మొదట్లోఅతను నన్ను చూచిచీదరించుకొంటున్నాడేమోనని భయపడ్డాను. పూర్వం పని పాటలు చెయ్యడంవల్ల మొద్దుబారిన అరచేతులనూ, ఎక్కువగా తడిలో తిరగడంవల్ల అసహ్యంగా పగిలిన కాలివేళ్ళనూ అతనికి కన్పించకుండా చేయడానికి ప్రయత్నము చేసిన మాటా వాస్తవమే.

అతను నాకన్న ఉన్నత కుటుంబానికీ-ఉన్నత స్థాయికీ చెందిన వ్యక్తి అనీ, నాకూ అతనికీ మధ్య సాంఘికమైన పెద్ద అఘాతం ఉన్నదనీ గ్రహించినప్పుడు చాలా విచారించాను. అతని విజ్ఞానాన్ని నా అజ్ఞానాన్నీ పోల్చి చూసుకొన్నప్పుడల్లా ఆ అఘాతం భయంకరంగా అవులించేది.మొదట్లో అతనితో స్నేహం చెయ్యడానికి నేనర్హురాలనా అనుకొన్నాను. అందాకా ఎందుకూ అసలతను పీల్చే గాలినే నేను పీల్చేందుకైనా తగుదునా అనుకొన్న క్షణాలూ లేకపోలేదు. నిజం చెప్పాలీ అంటే - అతని స్నేహాన్నీ - అతని సానుభూతినీ నేను మనసారా వాంఛించాను. అతనిలాంటి మిత్రుడు నాకు లభించినందుకు అప్పట్లో ఎంతో సంతోషించాను!...కాని ఎంతలో ఎంతమార్పు వచ్చిందీ!ఆనాటి ఒంటరితనమే దానికి కారణమా? కాదు. ఎంతమాత్రం కాదు. ఎన్నిసార్లు నేనాతనితో ఒంటరిగా కూర్చుని మాటాడలేదూ! అసలు నా స్నేహం అల్లాగే అభివృద్ధి అయింది.

ఆ రోజున-ఒక మధ్యాహ్నంపూట వాళ్ళిల్లు చూడడానికి నేనూ, అన్నయ్యాకలిసి వెళ్ళాము. అతను మేడమీద తను చదువుకొనే గదులు చూపించాడు. మొట్టమొదటిది పెద్దహాలు-దాన్నిండా ఎక్కడ చూచినా పుస్తకాలే. వరుసలు వరుసలుగా పుస్తకాలన్నీ బీరువాలలో చక్కగా

సర్ది ఉన్నాయి. అతను మాకు ముందు నడుస్తూ "ఇవిగోనండి—ఇవి సంస్కృత గ్రంథాలు—ఇవి పురాణాలు—ఇవన్నీ తెలుగు పుస్తకాలు—ఈ చివరివన్నీ ఆంగ్ల గ్రంథాలు" అంటూ అవన్నీమాకు చూపించాడు ఆయా మహాకవుల, మహాపండితులపేర్లూ వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలను గురించి చెబుతూ.

నాకు నిజంగా ఆశ్చర్యం వేసింది. మానవులకు పనికివచ్చే ఇంత విజ్ఞానం—పుస్తకాలలో పొందుపరచబడి ఉన్నదా అని. ఆ పుస్తకాలన్నీ నామీదకే ఒరుగుతూ నన్ను అణచివేస్తున్నాయా అనిపించింది. వాటి మధ్యగా నడుస్తుంటే...ఆ వేదాంతులూ, మహాపండితులూ—ఆ మహా కవులూ—తలలు బయటకు పెట్టి నవ్వుతూ నన్నే చూచి వెక్కిరిస్తున్నారా అనిపించింది.

అవును, ఆ తర్వాతనే మా స్నేహం నిజంగా పెరిగింది. ఆ పుస్తకాలలో ఉన్న విజ్ఞానంలో కొంత భాగమైనా సంపాదించాలనే పట్టుదల నాలో ఎక్కువైంది. అతనందుకు నాకు సాయమయ్యాడు. మే మిద్దరమూ—అవును ఒంటరిగానే కూర్చుని అనేక విషయాలు మాటాడు కొన్నాము. నా సందేహాలకు సహనంతో సమాధానాలు చెప్పేవాడు. అనేక గ్రంథాల నుండి అనేక విషయాలు చదివి వినిపించేవాడు, శ్లోకాలూ, పద్యాలూ ఒకటేమిటి అనేకం చదివి అర్థాలు చెప్పేవాడు—నిజం—అతని కంఠస్వరం ఎంత మధురమైందీ! అతను మాటాడితే—గంభీరంగా ఉంటుంది—నిశ్శబ్ద నిశీథంలో చిరుగంటలు మ్రోగినట్లుగా ఉంటుంది. పద్యం చదివినా—శ్లోకం చదివినా—వీణమీటినట్లుగా ఉంటుంది. ...అవును నా కెంతో ఉపకారం చేశాడు. సౌందర్యమంటే ఏమిటో—రసాస్వాదన అంటే – ఏమిటో తెలియజేశాడు. నాకోమార్గం చూపించాడు. చీకటి కోణాల్లోంచి నన్ను వెలుగుబాటలోకి తీసికొని వచ్చాడు...అవును—అంతా సత్యమే—చేసిన ఉపకారం మర్చిపోను...

కాని ఆరోజు రాత్రి జరిగినదానికే కారణం తెలియకుండా ఉంది. ఆ హిమాలయ పర్వతశిఖరమేముందకువంగి-నన్ను-నిర్భాగ్యురాల్నిముద్దాడబోయింది. అయినా నేను అంగీకరించలేదు-అసలు నేనెల్లా నిరాకరించగలిగానో...అతనిమీద అభిమానం లేకనా—అభిమానం, గౌరవం-వేరూ-ఇది వేరూ. అవును, ఒక సంప్రదాయంలో పెరిగిన నారక్తం తిరగబడ్డది. అది సరేగాని అతనెందుకలా ప్రవర్తించాడబ్బా!" అని మళ్ళీ మళ్ళీ తన్ను తానే ప్రశ్నించుకొంటూ పిడికిలి బిగించి దాన్ని రెండో అరచేతులో కొడుతూ ఆలోచించడం మొదలుపెట్టింది సరళ.

"పోనీ అతనూ చెడ్డవాడా...ఛా ఛా కాదు—అతను మంచివాడే—అదేదో హఠాత్సంభవమైన విషయం" అని ఓ నిర్ణయానికి వచ్చి కొంతసేపు మౌనం వహించింది.

"పోనీ అతను సంఘ సంస్కారి అవుతానంటున్నాడుగదా...ఆ అవకాశంనేనే వినియోగించుకుంటే...ఏమిటీ—ఏమిటీ ఎంతఅన్యాయంగా, అధర్మంగా ఆలోచిస్తున్నావు' అటువంటి వాటికి నారక్తంలో ఏ అణువూ ఒప్పుకోదు. వద్దు. వద్దు-మళ్ళా ఆ వ్యవహారాలే వద్దు—ఆ తోడు మంచిదేగానీ...ఆ సౌఖ్యమూ వద్దు—ఆ కష్టనిష్ఠురాలూ వద్దు – ఆ ఆనందంలో లవలేశమైనా మిగలదు సరికదా అపనిందా రేఖమాత్రం కొసకు మిగిలిపోతుంది...వద్దు వద్దు .... వద్దు అటువంటి పాపపు ఆలోచనేవద్దు-ఏ జన్మలో చేసిన పాపమో ఇప్పుడు అనుభవిస్తున్నది చాలక మరో జన్మకు పాపాన్ని పోగుచేసుకోవడమా? నా విషయం ఎల్లాగున్నా-అతని విషయంలో అటువంటి ఆలోచనే అధర్మం-అన్యాయం - నాదేముంది? నా జీవితం అయిపోయినట్లే-అతని జీవితమంతా ముందే ఉన్నది. అతను ముందు ముందు ఇంకా పైకివస్తాడు, రావచ్చు-రావచ్చు ఏమిటి-తప్పక వస్తాడు. అవును ఎందుకు రాడూ? ఇంత సుగుణసంపద —ఇంత భాగ్య సంపదా ఉన్నప్పుడు తప్పక మహోన్నత సాయిని

అందుకొంటాడు అవునా—ఆ అందుకొనేటప్పుడు ఈ విషయం పెద్ద ప్రతిబంధక మవుతుంది. అతని జీవితానికి కళంక మవుతుంది. అందరూ వేలెత్తి చూపిస్తారు. దెప్పిపొడుస్తారు. అవమాన పరుస్తారు. నిజంగా అల్లా జరిగితే అతను బాధపడిపోతాడు. పతనమై పోతాడు. దానికంతటికీ కారణం?—నేను.అవును నేనవుతాను. ఛా! వీల్లేదు. అల్లాగాజరగనివ్వను. అతన్నింక కన్నెత్తి చూడను. అంతే.అదే బావుంది. అల్లాగే చేస్తాను. అసలతనితో నాకు పరిచయమే కలుగలేదనుకొంటా అంతే అంతే" అనుకొన్నది సరళ మళ్ళీ మళ్ళీ.

"మరయితే—నేనింక ఏం చెయ్యాలి? చదువుకోవాలి!చదువుకొని? చదువుకొని విజ్ఞానవంతురాలినై—ఆకాశంలో—గాలి నెదిరిస్తూ, ఎదురీత ఈత్తూ వెళ్ళే పిట్ట — కష్టాలను వెనక్కు నెట్టేసుకుంటూ—కలత కలిగించే గాధలన్నీ మర్చిపోతూ ముందుకు వెళ్ళాలి."బాగా అన్నావు మరి దాంతో నా సమస్యలన్నీ తీరిపోతాయా? "ఓస్! వాటికేమిటి? ప్రపంచంలో ఎన్ని సమస్యలు లేవూ! రోజు రోజూ కొత్త సమస్యలు తలఎత్తుతూనే ఉన్నాయి. కాని అల్లాంటిస్థితిలో కూడా ప్రపంచం వేగంగా ముందుకు సాగిపోతోంది. అంతే దాన్ని నువ్వూ అనుసరించు. వెనకపడకు. నిజం బాగా చెప్పావ్‌సరిగ్గా అతను చెప్పినట్లుగా చెప్పావు!

కానీ, మోహన్ ఎంత అన్యాయం! అదుగో మళ్ళా మొదలా. అసలు నీ కతనితో పరిచయమే లేదుగా.

అంతే—అంతే...అతను నాకు తటస్థ పడలేదనుకుంటా ఆ ఒక్క రోజున ఆవిధంగా జరగకుండా ఉంటే ఎంత బాగుండేదీ! పోనిద్దూ గొడవ. ఇతరులపై నిందారోపణచేస్తూ ఉండకూడదు. సరె ఏదో జరిగింది. అంతా మర్చిపోతాను. ఇంతకు ముందు కల్గిన బాధల్లోఇదొకటి అనుకొంటాను. కాని ఒకటి మాత్రం విచిత్రంగా ఉన్నది. అతనూ ఆ సమయంలో — యువకుడు కదా! దౌర్జన్యం బలవంతం

చేయకుండా ఎల్లా ఉండి పోగలిగాడూ! చివరకు అతనే దుఃఖపడట మేమిటీ? అవును....అదే కారణం అయి ఉంటుంది......అంతటి ఆవేశంలో ఉన్నప్పుడు పిడుగులా వచ్చిన నాతృణీకారాన్ని అతనుతట్టుకో లేక పొయ్యాడు. అంతకు మించిమరోలా ప్రవర్తించడానికి అతని స్వాభి మానం అడ్డువచ్చింది.నాఅయిష్టత అడ్డు వచ్చింది.అవును.తనసంస్కారం అడ్డువచ్చింది. అందువల్లనే నేను కాదనంగానే వెళ్ళి దూరంగా కూర్చు న్నాడు. అంతటి ఆవేశాన్ని ఒక్క_మాటు_అన్ని విషయాలు అడ్డువచ్చిన మీదట_అణచుకొనే సరికి దుఃఖ మేదో పొంగి వచ్చి ఉంటుంది. అంతే అయిఉండాలి. ఏమైనా అతను మంచివాడే" అనుకొన్నది సరళ. "నిజంగా ఆ సంఘటన నా జీవితానికి కళంకమే అవుతుందా? ఎల్లా అవుతుందీ! ఏమంత దుర్మార్గం చేశాననీ? అంత చిన్న తప్పులు కూడా చెయ్యకుండానే ఉన్నారా నా స్థితిలో ఉన్నవాళ్ళంతా?_అయినా ఎందు కిప్పుడు నాకీవితర్కం?"అని మళ్ళీ పూర్వపు నిశ్చయానికి వచ్చికాసేపు మౌనం వహించింది సరళ.

అంతలో మేడ మెట్లమీద నుండే "అత్తా అత్తా"అంటూ విమల రావడంగమనించి"ఇదీ భలే పిల్ల!పిట్ట కొంచెం కూత ఘనమున్నూ! పిల్ల చూస్తే పదమూడేళ్ళయినా లేవు. అప్పుడే హైస్కూలు చదువు పూర్తి కావస్తోంది...ఎంతసేపూ సినిమా కబుర్లు. తలకు మించిన కబుర్లు చెబుతుంది. ఆ తార వీణ్ణి ప్రేమించిందనీ, వాడు దీని ప్రేమలో పడ్డాడనీ. అది అందులో బాగా నటించిందనీ, అతను మరొకదానిలో తగలేశాడనీ ఏమిటో చెబుతుంది. ఎందుకు దీనికా కబుర్లన్నీ. ఎక్కడ సంపాదిస్తుందో ఏమిటో ఈ భోగట్టాఅంతా, పైగా నేనత్తగారి వేషానికీ, తానేమో చిన్నకోడలు వేషానికీ, ఇప్పట్లో ఉన్న నటీమణు లందరికంటే వెయ్యి రెట్లు ఘనంగా సరిపోతామట. బాగానే ఉన్నది. అంతటితో ఊరు కొంటే బాగానే ఉంటుంది! నేను ఒప్పుకొంటే మా యిద్దరి ఫొటోలూ

కలిపి సినిమా పత్రికల్లో తన ఉద్దేశం వివరిస్తూ ప్రకటిస్తుందట. అల్లరికైనా అంత ఉండాలి. పోనీ అది అన్నమాటే బాగుంది. నన్ను పెద్ద అత్తగార్ని చేసేసింది. అవును దాని మాటే బాగుంది. ఒక్కసారి నాకు యాభైయేళ్ళు వచ్చేస్తే బ్రతికిపోతాను" అనుకొన్నది సరళ అప్రయత్నంగా చిరునవ్వు నవ్వుతూ ఊడిపోయిన జుట్టుముడి మళ్ళీ ముడివేసుకొంటూ.

---